


# నవభూమి

## జిల్లా అనుబంధం

19 ఫిబ్రవరి,2025 బుధవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


# సైబర్ నేరాలతో.. సమాజానికి ముప్పు



- కొత్త రూపంతో సైబర్ నేరగాళ్ల మోసాలు
- గతేడాది దేశవ్యాప్తంగా రూ.22,812కోట్ల దోపిడీ
- సోషల్ మీడియాలో అవాస్తవాల వ్యాప్తి
- అడ్డుకట్ట వేయకపోతే ఆర్థిక వ్యవస్థకూ నష్టం
- సైబర్ నేరాల కట్టడిలో రోల్ మోడల్ తెలంగాణ
- సైబర్ సెక్యూరిటీ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** సైబర్ నేరాలు సమాజానికి ముప్పుగా పరిణమించాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి క్షణం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం జరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఒకప్పుడు దొంగలు ఇంట్లోకి చొరబడి దొంగతనాలు చేసేవారని, ఇప్పుడు కంటికి కనిపించకుండా ల్యాప్‌టాపలు, సెల్‌ఫోన్లలోకి చొరబడి ఉన్నదంతా దోచుకుంటున్నారని పేర్కొన్నారు. గతేడాది దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రూ.22,812 కోట్లు దోచుకున్నట్లుగా అంచనాలు ఉన్నాయని తెలిపారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో పౌరులకు, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో హెచ్ఐసీసీలో షీల్డ్-2025 పేరుతో 'బాధితులకు రక్షణ కవచంగా సైబర్ భద్రత-డిజిటల్ భవిష్యత్తు' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. దీంతోపాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేంద్రంగా కొత్తగా ఏర్పాటు చేసిన సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (సీవోసీ), సైబర్ ఫ్యూజన్ సెంటర్ (సీఎఫసీ)లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సైబర్ నేరాల కట్టడిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు.

ఈ విషయంలో రాష్ట్ర పోలీసులు దేశంలోని మిగతా రాష్ట్రాల కన్నా ముందంజలో ఉన్నారని కితాబిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఇటీవల ఈ విషయాన్ని ప్రకటించిందని చెప్పారు. అయితే సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్తరకం మోసంతో ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. కొత్త రూపాలు సంతరించుకుంటున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు పరిమితమైన విధానాలతో కేవలం ఒక రాష్ట్రం చేసే ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వవని, రాష్ట్రాలన్నీ సమన్వయంతో దేశం యూనిట్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

సోషల్ మీడియా, డీప్ ఫేక్‌ను ఉపయోగించుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, జరగని నేరాలు, దాడులు జరిగినట్లు అవాస్తవాలను వ్యాప్తి చేస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. అడ్డూ అదుపు లేకుండా జరుగుతున్న ఇలాంటి ప్రచారాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సైబర్ నేరాలు ప్రపంచ దేశాలకే సవాలుగా మారాయని, ప్రతి క్షణం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం జరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. నేరం ఎక్కడి నుంచి జరిగింది, నేరానికి పాల్పడింది ఎవరని గుర్తించి పట్టుకుని శిక్షించడంతోపాటు.. అసలు సైబర్ నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించాలన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు బాధితులకు తక్షణ సహాయం కోసం 24/7 అందుబాటులో ఉండే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930ని ప్రతి ఒక్కరికీ షేర్ చేసి అవగాహన



కల్పించాలని సూచించారు. సైబర్ సెక్యూరిటీ ఆవిష్కరణల్లో పెట్టుబడులు పెట్టడం, ఇంటెలిజెన్స్-షేరింగ్ ఫ్రేమ్‌వర్క్‌లను మెరుగుపరచడం, రాష్ట్రానికి సురక్షితమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థను నిర్ధారించడానికి కీలక భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకుగాను ఆయా రాష్ట్రాలతో సమన్వయం సాధించడానికి దేశంలో ఒక కనెక్టింగ్ బ్రిడ్జ్‌లా ఈ సదస్సు ద్వారా ప్రయత్నించడం అభినందనీయమన్నారు.

యువ నిపుణులు, విద్యార్థులు సైబర్ భద్రతలో కెరీర్‌లను చేపట్టేలా ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో ఈ తరహా నేరాలను పూర్తిస్థాయిలో అడ్డుకునేందుకు అవకాశం ఉంటుందని సీఎం చెప్పారు. సైబర్ భద్రతలో తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సైబర్ భద్రత విషయంలో ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూస్తోందన్నారు. రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధునాతన టెక్నాలజీతో పనిచేస్తోందని చెప్పారు. సైబర్ నేరగాళ్లు దోచుకున్న మొత్తంలో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు రూ. 350 కోట్లు ఫ్రీజ్ చేశారని, అందులో పెద్ద మొత్తాన్ని తిరిగి బాధితులకు అప్పగించారని తెలిపారు. టెక్నాలజీతో ప్రయోజనాలతోపాటు అదే స్థాయిలో ముప్పు కూడా ఉంటుందని, ఈ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి సూచించారు. అన్ని రంగాలపై సైబర్ నేరగాళ్ల ప్రభావం ఉందని చెప్పారు. హెూంశాఖ కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, తదితరులు పాల్గొన్నారు. లెఫ్టినెంట్ జనరల్ ఎంయూ నాయర్, ట్రాయ్ మాజీ ఛైర్మన్ ఆర్ఎస్ శర్మ ఆయా అంశాల్లో కీ నోట్‌పై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఐటీ రంగం ప్రతినిధులు, బీఎఫఎసఐ, టెలికాం, రక్షణ మరియు ప్రజా విధాన సంస్థలు, ప్రపంచ టెక్ కంపెనీలు, స్టార్టప్‌ల నుంచి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

వైద్యం, వ్యవసాయం, ఏఐ, ఐటీ, మైనింగ్, బయోటెక్ రంగాల్లో రాష్ట్రంలోని స్టార్ట్‌పలు తమ ఆలోచనల్ని బ్రెజిల్‌లోని గోయాస్ రాష్ట్రంలోని స్టార్ట్‌పలతో పంచుకునేందుకు ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది.

## కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి

# మహిళ మృతి

- 'చేవెళ్లలోని 'పట్నం' ఆస్పత్రిలో శస్త్రచికిత్స.. సీరియస్
- మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి
- 'పట్నం' ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

**చేవెళ్ల-నవభూమిప్రతినిధి:** ఇద్దరు పిల్లల ఓ తల్లికి.. ఓ ఆస్పత్రి వైద్యులు చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించింది. శరీరంలో ఇన్‌ఫెక్షన్ సోకి మహిళ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె చనిపోయిందంటూ మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా పూడూర్ మండల పరిధిలోని అంగడి చిట్టెంపల్లికి చెందిన చుంచు మమత (25)కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 12న ఆమెకు చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో వైద్యులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు. ఈ నెల 15న రాత్రి మమతకు జ్వరం రావడంతో వైద్యులు మందులు ఇచ్చారు. జ్వరం తగ్గకపోగా.. మరుసటి రోజు తీవ్రమై బీపీ 70కి పడిపోయింది. దీంతో పరిస్థితి విషమంగా ఉందని, ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే వారు ఉస్మానియాకు కాకుండా ప్రీమియర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు ఇన్‌ఫెక్షన్ సోకినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. రెండు రోజుల చికిత్స అనంతరం మమత ఆరోగ్యం మరింత క్షీణించి సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది.

**20 లక్షల పరిహారం ఇస్తాం : పట్నం ఆస్పత్రి యాజమాన్యం**



పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మమత చనిపోయిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం ఉదయం మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు, రాజకీయ నాయకులు ఆస్పత్రి యాజమాన్యంతో చర్చలు జరపడంతో రూ.20 లక్షల సాయం అందిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. దీంతో ఆందోళన విరమించారు. కాగా, మమతకు ఆపరేషన్ చేయడంలో వైద్యుల నిర్లక్ష్యం లేదని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి అన్నారు.

# జేఎన్‌టీయూ వీసీగా కిషన్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్-నవభూమి:** జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్ టీయూ) కొత్త ఉపకులపతిగా ఆచార్య టి.కిషన్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 16 ఏళ్ల తర్వాత జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌నే ఉపకులపతి (వీసీ)గా నియమించడం పట్ల యూనివర్సిటీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, వర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు నూతన వీసీకి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వివిధ విభాగాల డైరెక్టర్లు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి సమావేశమై.. యూనివర్సిటీ భవిష్యత్తు ప్రణాళికలపై సమీక్షించారు. వర్సిటీ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని అధికారులకు వీసీ పిలుపునిచ్చారు. వర్సిటీలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు, పరిశోధనలు, అభివృద్ధికి అనువైన వాతావరణం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.జేఎన్‌టీయూ కొత్త వీసీ టి.కిషన్‌కుమార్‌రెడ్డి వర్సిటీలో ప్రొఫెసర్ టీకేకేగా సుపరిచితులు. 1994 నుంచి 2016 వరకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని మెకానికల్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు.

## ఘనంగా బద్రి వెంకటయ్య వర్ధంతి



**రామకృష్ణపూర్-నవభూమి:-**క్యాతనపల్లి గ్రామ పంచాయతీ మొట్టమొదటి ఏకగ్రీవ సర్పంచి బద్రి వెంకటయ్య పటేల్ 38వ వర్ధంతిని మనవడు బద్రి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు చేతుల మీదుగా జ్ఞాపకార్ధంగా ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినిలకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్యాతనపల్లి గ్రామపంచాయితీ గా ఉన్నప్పుడు మొట్టమొదటి ఏక గ్రీవ గ్రామ సర్పంచ్ బద్రి వెంకటయ్య పటేల్ ఎన్నికయ్యారు. ఆయన 1958 నుండి 1971 వరకు 13 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమరవాది గ్రామస్తులు, పాఠశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ క్రీడల వల్ల యువతలో ఐక్యమత్యం క్రీడా స్ఫూర్తి పెరుగుతుంది: పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి ఫిబ్రవరి 18 (నవభూమి):** రాయపర్తి మండలం మైలారం గ్రామం మెయిన్ రోడ్డు ఎస్సార్ పెట్రోల్ పంపు ఎదురుగా స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను పరిశీలించిన. ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు శ్రీ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం వల్ల యువతలో ఐక్యమత్యం మరియు క్రీడా స్ఫూర్తి పెరుగుతుంది రాబోయే ఉద్యోగాలకు ఫిట్నెస్ కూడా పెరుగుతుందని తెలియజేశారు . ఈ కార్యక్రమం లో రాయపర్తి మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మేనేజ్మెంట్ కమిటీ, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు లేతకుల మహేందర్ రెడ్డి, కోలా సంపత్, ఎల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన



**రామకృష్ణాపూర్-నవభూమి:-**సమాజంలో ఆడవారి పట్ల జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలలో ఆర్థిక దోపిడీ ఏ విధంగా జరుగుతుదో విద్యార్థినులకు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలనీ పట్టణ ఎస్ఐ జి రాజశేఖర్ సూచించారు. మంగళవారం పట్టణంలో ని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకాతాయిలు దురుసుగా ప్రవర్తించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలనీ, మహిళల పట్ల జరుగుతున్న నేరాల కట్టడికోసం రామగుండం పరిధిలో "షీ" టీమ్ నిత్యం పని చేస్తున్నదని వివరించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల మోసాలకు గురి అయితే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ 1930 కు డయల్ చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ కమీషనర్ గద్దె రాజు,ఏ ఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, కానిస్టేబుల్ సురేష్, స్వాతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# 20న చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

- ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం.
- పిడిఎస్‌యూ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బి. శ్రీకాంత్
- చేవెళ్ల మండల ఆలూరు గ్రామంలో పోస్టర్ విడుదల



**చేవెళ్ల, ఫిబ్రవరి 18 నవభూమి :** రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, 420హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యూ ) చేవెళ్లే డివిజన్ కార్యదర్శి బి. శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అంటూ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాలు 14 నెలలు పూర్తవుతున్న అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎన్నికలలో ఇచ్చిన హామీలు, ప్రకటించిన పథకాలన్నీ అమలు చేస్తామని నేటికీ అమలు చేయలేక పోయారని అన్నారు . మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నేడు అమలు చేయలేక కాలయాపన చేస్తుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో పాలకులకు, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పేదోడిని కొట్టి ఉన్నోనికి పెట్టు అనే చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ విదానాన్నే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని విమర్శించారు. తక్షణమే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ప్రజలపట్ల ఒకే వైఖరి కలిగి ఉన్నాయని, ప్రజలు చైతన్యమై పాలకులకు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. హామీలు, వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న హైదరాబాద్ లో నిర్వహిస్తున్న ప్రదర్శన, సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాఘవేందర్, నరేష్,శ్రీనాథ్ ,పోచయ్య,నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈదమ్మ జాతర

**వీపనగండ్ల .ఫిబ్రవరి 19:-** వీపనగండ్ల మండల పరిధిలో తూముకుంట గ్రామంలో ఈదమ్మ జాతర ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మవారి మొక్కులు తీర్చుకోవడానికి ముందుగా పిండేను భక్తులు లాగి ఘనంగా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై కే. రాణి పాల్గొన్నారు జాతర నిర్వాహకులు మాజీ సర్పంచ్ మానస మౌలాలి పలస రామన్ గౌడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ దేవత అయిన ఈదమ్మ ను గతంలో తూముకుంట గ్రామానికి తీసుకువచ్చి ఇక్కడ కొలువైనటువంటి ఈదమ్మ దేవతకు గుడి కట్టించి ఈ గ్రామంలోని గ్రామస్తులు మొక్కులు తీర్చుకునే వారని వారు తెలిపారు. అయితే మొదటగా కాలూరి గ్రామానికి చెందిన ఆడిబిడ్డగా ఈదమను కొలుస్తారు అయితే ఆ గ్రామం నుండి అమ్మవారికి వడి బియ్యం తీసుకువచ్చి నైవేద్యం పెట్టిన తర్వాత తూముకుంట గ్రామస్తులు భక్తితో చేసినటువంటి ఫలహారాలు కుంభ నైవేద్యము తో పూజలు నిర్వహిస్తారని పూజారులు రవి, నాగయ్య తెలిపారు. ఈ గ్రామంలో జరిగిన ఈదమ్మ జాతరకు చుట్టుపక్కల పల్లెలోని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి బోనాలతో నైవేద్యం పెట్టి అమ్మవారికి కోరికలు మొక్కుబడులు తీర్చుకుంటారు ఈ సండే కార్యక్రమంలో భక్తులు లోడుగు రాజు బోరెల్లి రాజు పోతు రాజు విజయ్ పాల్గొన్నారు









# పద్మశ్రీ మందకృష్ణ మాదిగను కలిసి మండల నాయకులు



**చేగుంట ఫిబ్రవరి 19 నవభూమి :-**అలుపెరగని పోరాట ఉద్యమకా రుడు పద్మశ్రీ మంద కృష్ణ మా దిగను చేగుంట మండల ఎ మ్మార్పీస్ అద్య క్షులు కోల్పుల రామస్వామి మర్యాదపూర్వ కంగా కలిసారు. ఆదివారం ఆ యన హైద్రాబాద్ లో మందకృ ష్ణ మాదిగను కలసి కొలు పులను మొదటి గ్రూపు నుండి మూడో గ్రూపులోకి వేయాలనడం బాదాకరంగా ఉందని మేము ఏ గ్రూపు లోనే ఉంటామని మా గ్రూపును మార్చవద్దని తెలిపినట్లు స్వామి తెలి పారు. మా కొలుపులు సామాజికంగా, రాజకీయంగా, అర్థికంగా అన్ని విదాల వెనకబడి ఉన్నామని మా కొలుపులు ఏ గ్రూపులోనే ఉం టామని మాకు తహసీల్దార్ కార్యాలయం నుండి కొలుపుల అన్ని సర్టి పికెట్లు ఇచ్చే విదంగా కృషి చేయా లని కోరగా సా నుకూలంగా స్పందించి మీకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తానని తెలిపా రు. ఏ పిలుపు ఇచ్చినా సిద్దంగా ఉండాలని కార్యాలయం నుండి ఫోన్ వస్తుందని ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**రాయపర్తి ఫిబ్రవరి 18( నవ భూమి):** రాయపర్తి మండలం,గుబ్బడి తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోతు మోహన్-వినోదా దంపతుల ప్రథమ పుత్రుడు గుగులోతు సంతోష్-అనూషా ల వివాహ మహోత్సవం వారి స్వగృహంలో జరుగగా వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని,నూతన వధూవరులను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలిపిన పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బండారు తులసి 8వ వర్ధంతి

### పాల్గొన్న సిపిఎం జిల్లా నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు



**భద్రాచలం పిబ్రవరి 18 నవభూమి ప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను కదిలించి ప్రజా పోరాటాలు నిర్మించడమే అమరజీవి కామ్రేడ్ బండారు తులసికిచ్చే ఘన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. మహిళా శాఖ కార్యదర్శి, ఐద్వా నాయకులు అమరజీవి కామ్రేడ్ బండారు తులసి 8వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరింత పెరిగిందని అన్నారు. నేడు సమాజంలో పేదరికం, అసమానతలు, నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఈ సమస్యలపై మాట్లాడేది,పోట్లాడేది సిపిఎం మాత్రమేనని అన్నారు. దేశంలోని పాలకులు కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు అనుగుణంగా నూతన ఆర్థిక విధానాలను అమలు చేస్తున్నారని, ప్రశ్నించిన వారిపై దేశద్రోహం ముద్రలు వేసి తప్పుడు కేసులు పెట్టి జైలకు పంపుతున్నారని ఈ నేపథ్యంలో దేశానికి కమ్యూనిస్టుల ఆవశ్యకత మరింత పెరిగిందని అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ మాట్లాడుతూ కామ్రేడ్ తులసి పార్టీ మహిళా సంఘం కార్యకలాపాలతో పాటు బహుముఖ కార్యక్రమాలు వార్డు పరిధిలో నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిందని అన్నారు. సిపిఎం అఖిలభారత మహాసభలు ఏప్రిల్ నెలలో జరగనున్నాయని, ఈ మహాసభల్లో రానున్న కాలంలో పార్టీ తీసుకోవాల్సిన రాజకీయ నిర్మాణ ఎత్తుగడలపై పార్టీ కార్యకర్తలు తగు సూచనలు చేయాలని అన్నారు. ఇంకా పార్టీ సీనియర్ నాయకులు ఎలమంచి రవికుమార్, జి ఎస్ శంకర్రావు, ఎంబి నర్సారెడ్డి, ఐద్వా జిల్లా నాయకులు ఎన్ .లీలావతి లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే బ్రహ్మచారి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు సీనియర్ నాయకులు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు పి సంతోష్ కుమార్ పట్టణ నాయకులు ఎం వి ఎస్ నారాయణ జీవనజ్యోతి కోరాడ శ్రీనివాస్ అజయ్ కుమార్ భూపేందర్ ఐద్వా నాయకులు పూర్ణ, ఏజే గౌతమి, నాగలక్ష్మి , రాధా, సరస్వతి,తదితరులు పాల్గొన్నారు.. ఇంకా పార్టీ సీనియర్ నాయకులు ఎలమంచి రవికుమార్, జి ఎస్ శంకర్రావు, ఎంబి నర్సారెడ్డి, ఐద్వా జిల్లా నాయకులు ఎన్ .లీలావతి లు మాట్లాడారు.

# రేణుక మాత అందరిని చల్లగా చూడమ్మా

- మెదక్ పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక
- మాతకు ఘనంగా బోనాలు
- పట్టణ ప్రజలను ఆకట్టుకున్న జనగామ కోలాటం విన్యాసాలు
- అమ్మవారిని దర్శించుకున్నా ఎమ్మెల్యే రోహిత్ రావు
- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి
- ఆలయానికి పోటెత్తిన భక్తజనం









**మెదక్-నవభూమి:**కౌండిన్యుల ఆరాధ్య దైవమైన శ్రీ రేణుకా మాత (ఎల్లమ్మ) ఆశీస్సులు ఎల్లప్పుడు కలిగి ఉండాలని మంగళవారం మెదక్ పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు అనుగుణంగాఆధ్యాత్మిక చింతనతోనే పసుపు కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను తయారు చేసి మహిళలు నూతన వస్త్రాలు దరించిన నెత్తిన పెట్టుకుని ప్రధాన వీదుల గుండా ఊరేగించారు. ఈ బోనాలు ఉరేగింపులో పోతరాజుల,శివ సత్తులవిన్యాసాలు, జనగామ మహిళల కోలాటం ,యువకుల నృత్యాలు. శివసత్తుల పూనకాలు డబ్బు వాయిద్యాల మధ్య మరియు డిజే సౌండ్ తో పుర వీదుల గుండా తరులుతు యువకుల కేరింతల మధ్య అంగరంగ వైభవంగా బోనాలను అమ్మవారికి సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు మంగ రమేష్ గౌడ్,ఆలయ చైర్మన్ విద్యాధర్ గౌడ్, మాజీమున్సిపల్ చైర్మన్ మల్లిఖార్జున్,మాడురి కృష్ణ గౌడ్ , ఆరేళ్ళ జనార్దన్ గౌడ్, మంగ అశోక్ గౌడ్ , నర్సింలు గౌడ్ , ముత్యం గౌడ్ . మంగ నారాగౌడ్, శంకర్ గౌడ్ లక్ష్మీనారాయణ గౌడ్ సత్యం గౌడ్ తదితరులు గౌడ సంఘం సభ్యులు, మహిళలు భారి ఎత్తున పాల్గొన్నారు .

### ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల మనోభావాలను

# మరింత బలపరిచేలా ఉంటాయి ఝాన్సీ రెడ్డి





**రాయపర్తి ఫిబ్రవరి 18( నవ భూమి):** రాయపర్తి మండలంలోని కొండూరు గ్రామంలోని గుట్టమీద భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లి పండుగ ఘనంగా నిర్వహించబడింది. ఈ పండుగలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు..ఈ సందర్భంగా, భక్తులతో కలిసి ఝాన్సీ రెడ్డి .గంప నెత్తినెత్తుకొని అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు చేశారు. భక్తి మయమైన ఈ వేడుకల్లో వారు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించారు..ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ. ఎల్లమ్మ తల్లి అనుగ్రహం అందరికీ కలగాలని కోరుకుంటున్నాను. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల మనోభావాలను మరింత బలపరిచేలా ఉంటాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను పటిష్టంగా కొనసాగించాల్సిన బాధ్యత మనందరిదీ. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు.. అంతేకాకుండా, గ్రామ ప్రజలు, భక్తులు, యాత్రికులు పెద్ద సంఖ్యలో ఈ పండుగలో పాల్గొన్నారు. స్థానిక మహిళలు, భక్తులు గంపలతో అమ్మవారికి తమ భక్తి అర్పించారు. ఆలయ పరిసరాల్లో వివిధ భక్తి కార్యక్రమాలు, సంగీత భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి.ఈ వేడుకలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు, మహిళా సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. పండుగ సందర్భంగా అన్నదానం, భక్తి గీతాలు, కృష్ణ లీలలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి..ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, స్థానికులు ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారి ఆత్మీయత, వారి భక్తి భావానికి హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి గురించి, ఆలయ అభివృద్ధికి చేయవలసిన కృషి గురించి కూడా ప్రజలతో చర్చించారు.